



www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY NEWS PAPER

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

మంగళ వారం
07-02-2023
సంపుటి - 08,
సంచిక-252
పేజీలు - 4
వెల రూ. 5/-

ఎడిటర్ : పృద్విరాజ్. జి
9581442622

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole


## టర్కీ, సిరియాలను కుదిపిన

# భారీ భూకంపం

### పేకమేడల్లా కూలిన బహుళ అంతస్థుల భవనాలు



- రిక్టర్ స్కేలుపై తీవ్రత 7.8గా నమోదు
- 237 మంది మృతి చెందినట్టు గుర్తింపు
- శిథిలాల కింద చిక్కుకున్న వందలాది మంది

**అంకారా, ఫిబ్రవరి 6 (సమసమాజం):** టర్కీ,సిరియాలను భారీ భూకంపం కుదిపేసింది. ప్రజలంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో సోమవారం తెల్లవారుజామున టర్కీ , సిరియాలలో భారీ భూకంపం సంభవించి పలు నగరాల్లో వందలాది భవనాలు పేకమేడల్లా కుప్పకూలాయి. ఇప్పటి వరకు 237 మంది మృతిచెందగా.. 639 మందికి పైగా గాయపడ్డారు. మొదట 90 మంది మరణించినట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. శిథిలాల కింద అధిక శాతం మంది చిక్కుకుపోవడంతో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. స్థానిక కాలమానం ప్రకారం ఈరోజు తెల్లవారుజామున 4.17 గంటలకు ఈ భూకంపం సంభవించింది. భూకంప లేఖినిపై దీని తీవ్రత 7.8గా నమోదైనట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. టర్కీలోని గాజియాన్ తెప్ ప్రాంతానికి 33 కిలోమీటర్ల

3లో

## హైకోర్టులో తెలంగాణ

# ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

### సింగిల్ జడ్జి బెంచ్ తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్ • ఎమ్మెల్యేల ఎర కేసులో సీబీఐ విచారణకు ధర్మాసనం ఓకే • తీర్పుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన హైకోర్టు

**హైదరాబాద్, ఫిబ్రవరి 6 (సమసమాజం):** హైకోర్టు లో తెలంగాణ ప్రభుత్వానికి మరోమారు ఎదురుదెబ్బ తగిలింది. ఫాం హౌస్ కేసులో తెలంగాణ సర్కారుకు మళ్లీ పరాభవం తప్పలేదు. ఎమ్మెల్యేలకు ఎర కేసులో సీబీఐ విచారణను న్యాయస్థానం అంగీకరించింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థిస్తూ.. ప్రభుత్వ పిటిషన్‌ను కొట్టివేసింది. కాగా ఈ ఆర్డర్‌పై సుప్రీం కోర్టకు వెళ్లేందుకు కొంత సమయం ఇవ్వాలని అడ్వకేట్ జనరల్ అడిగారు. అప్పటి వరకు ఆర్డర్‌ను సస్పెండ్‌లో ఉంచాలని కోరారు. అయితే ఆర్డర్ సస్పెన్షన్‌కు హైకోర్టు నిరాకరించింది. తెలంగాణలో ఎమ్మెల్యేలకు ఎర కేసులో ఇప్పటికే పలు ట్విస్టులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసును సీబీఐతో విచారణ జరిపించాలని సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. దీంతో సింగిల్ బెంచ్ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేస్తూ డివిజన్ బెంచ్‌లో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దుశ్యంత్ దవే వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు ముగిసిన అనంతరం జనవరి 18న హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తీర్పును రిజర్వ్ చేశారు. కేసును సీబీఐకి అప్పగించాలా..? వద్దా..? అనే అంశంపై సోమవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. మరోవైపు ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయడంపై ఈడీ హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో ఎటువంటి మనీలాండరింగ్

3లో




## అసెంబ్లీ బుధవారానికి వాయిదా

- బడ్జెట్ ప్రసంగం అనంతరం వాయిదాపడ్డ సభలు
- గంటా 44 నిముషాలు సాగిన బడ్జెట్ ప్రసంగం

3లో

## పార్లమెంట్‌ను కుదిపేస్తున్న ఆదానీ వ్యవహారం

- వరుసగా మూడోరోజూ విపక్షాల ఆందోళన
- జెపిసి ఏర్పాటుకు విపక్ష సభ్యులు డిమాండ్
- పార్లమెంట్ ఉభయ సభలు నేటికి వాయిదా

3లో

## ఢిల్లీ మేయర్ ఎన్నికలో తొలగని ప్రతిష్ఠంభన

- వరుసగా మూడోసారీ వాయిదా పడ్డ ఎన్నిక
- ఆప్ నిరసనలతో సభకు తీవ్ర అంతరాయం

3లో

## ప్రజలను మోసం చేసేలా బడ్జెట్

- రైతు రుణమాఫీపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- మండిపడ్డ బిజెపి ఎమ్మెల్యే ఈటెల రాజేందర్

3లో

## బడ్జెట్‌లో మంత్రి హరీష్ రావు అంకెలగారడి

- మాయమాటలతో ప్రజలను మోసం ప్రయత్నం
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రుణమాఫీ ఎక్కడ
- మీడియా సమావేశంలో మండిపడ్డ కాంగ్రెస్ నేత భట్టి

3లో

## మూడోవ రోజు అసెంబ్లీ సమావేశాలు

## అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా

# తెలంగాణ బడ్జెట్

### ప్రతి రంగానికి పెరిగిన కేటాయింపులు: మంత్రి హరీష్ రావు





- దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ పురోగతి
- తెలంగాణ ఆచరిస్తే..దేశం అనుసరిస్తోంది
- రాష్ట్ర బ్జడెట్ అంచనాలను రూ.2,90,396 కోట్లు
- నీటి పారుదల రంగానికి రూ. 26,885 కోట్లు
- వ్యవసాయ రంగానికి రూ. 26,831 కోట్లు
- రుణమాఫీ పథకానికి రూ. 6,385 కోట్లు..
- రైతుబంధు పథకానికి రూ. 15,075 కోట్లు
- రైతుబీమా పథకానికి రూ. 1589 కోట్లు
- బడ్జెట్‌లో రైతుల రుణమాఫీ కోసం రూ. 6,385 కోట్లు
- విద్యుత్ రంగానికి రూ. 12,727 కోట్లు
- హోంశాఖకు రూ. 9,599 కోట్లు
- ఆర్థిక శాఖకు రూ. 49,749 కోట్లు
- విద్యాశాఖకు రూ. 19,093 కోట్లు
- వైద్య రంగానికి రూ. 12,161 కోట్లు
- ఆరిశ్రమల శాఖకు రూ. 4,037 కోట్లు
- రోడ్లు భవనాల శాఖకు రూ. 2,500 కోట్లు
- కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ కోసం రూ. 3,210 కోట్లు
- దళితబంధు కోసం రూ. 17,700 కోట్లు
- బీసీ సంక్షేమం కోసం రూ. 6,229 కోట్లు
- మహిళా, శిశు సంక్షేమం కోసం రూ. 2,131 కోట్లు.
- ఎస్సీ ప్రత్యేక నిధి కోసం రూ. 36,750 కోట్లు
- మైనార్టీ సంక్షేమం కోసం రూ. 2,200 కోట్లు
- గిరిజన సంక్షేమం, ప్రత్యేక ప్రగతి నిధికి రూ. 15,223 కోట్లు
- మైనార్టీ సంక్షేమం కోసం రూ. 2,200 కోట్లు
- ఆయిల్ ఫామ్‌కు రూ. 1000 కోట్లు
- అటవీ శాఖ కోసం రూ. 1,471 కోట్లు
- హరితహారం పథకానికి రూ. 1471 కోట్లు
- పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమానికి రూ. 4,834 కోట్లు
- డబుల్ బెడ్రూం ఇండ్ల పథకానికి రూ. 12,000 కోట్లు
- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థికమంత్రి హరీష్ రావు
- కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకానికి రూ. 200 కోట్లు
- ఆసరా పెన్షన్ల కోసం రూ. 12 వేల కోట్లు
- రాష్ట్ర అభివృద్ధికి మోకాలడ్డతున్న కేంద్రం
- విభజన హామీలన్న గాలికి వదిలేశారు
- నిధుల కేటాయింపులో తీరని అన్యాయం
- ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ఆంక్షలు
- బడ్జెట్ ప్రసంగంలో మండిపడ్డ హరీష్ రావు
- రూ. 90 వేల వరకు ఉన్న రుణాలను మాఫీ
- సర్పంచ్‌ల ఖాతాల్లో నేరుగా నిధులు
- రూ.4,800 కోట్లు వేస్తామని హరీష్ రావు ప్రకటన

2వ పేజీలో...

# సంపాదకీయం

## ఉపాధి ప్రణాళికలు మారాలి !

నీరుగారుతున్న ఉపాధిహామీ పథకం ప్రగతి వైపు పరుగెత్తేలా చేస్తేనే.. గ్రామాల్లో అభివృద్ధి సాకారం కానుంది. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో నిధులకు కోత విధించారు. మొత్తంగా దీనిని ఎత్తి వేస్తారన్న ప్రచారం సాగుతోంది. ఉపాధికి నిధులు తగ్గించడంపై అన్నిపార్టీల వారు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఉపాధిని మరింత పటిష్టంగా అమలు చేసి గ్రామాల అభివృద్ధి దోహద పడాల్సి ఉంది. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం కాగలదు. దశాబ్దంన్నర దాటినా ఇంతకాలం ఉపాధి పనులను చూస్తే బూడిదలో పోసిన పన్నీరుగా మారుతోంది. ఉపాధిహామిని గ్రామాల అభివృద్ధికి ఉపయోగించుకునే వెసలుబాటు ఉండాలి. ఆస్తులను సృష్టించేలా కార్యక్రమాలు ఉండాలి. నిధులను సంపూర్ణంగా వినియోగిం చుకునేలా ఉండాలి. అలాగే ఆయా రాష్ట్రాల సలహాలు తీసుకుని..వారి స్వేచ్ఛమేరకు ఉపాధి పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. గ్రామాల్లో హరితహారం, వైకుంఠ ధామాలు, చెరువుల పునరుద్ధరణ, గ్రామీణ రోడ్లు, పేలకు ఇంటి నిర్మాణాలు, కాలువల నిర్మాణాలు,రైతులకు కల్లాల నిర్మాణం ..ఇలా అనేకానేక పనులను గుర్తించాలి. ముందుగా రాష్ట్రాలను సంప్రదించడం ద్వారా ఏయే పనులు చేపట్టవచ్చో కేంద్రం రాష్ట్రాల నుంచి సమాచారం తెప్పించుకోవాలి. సర్పంచ్‌లకు శిక్షణ ఇవ్వడం ద్వారా దీనిని గ్రామాల అభవృద్ధిక మూలకేంద్రం చేయాల్సి ఉంది.. వారంతా ఉపాధి పథకం,నిధులు, వినియోగంపై తెలుసుకుని తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునే ప్రణాళికలు సిద్ధం చేయాలి. అప్పడే గ్రామాల్లో అభివృద్ధి పట్టాలకు ఎక్కుతుంది. నరేగా నిధులతోపాటు రాష్ట్ర బడ్జెట్ నిధులు, ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఉపయోగించుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి. నరేగా పథకం కింద కేంద్రం రాష్ట్రానికి ఎంత మొత్తంలో డబ్బులు ఇస్తుందో అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చేయాలి. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలోనే నరేగా పనులు జరుగాలి. హరితహారం, శ్మశానవాటికల నిర్మాణం, గ్రామీణ రోడ్లు, రైతులకు కల్లాలు,చెరువుల పునరుద్ధరణ వంటివన్నీ నిర్మాణం చేయాలి. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను సృష్టించడానికి నిధులను ఉపయోగించాల్సి ఉంది. అన్ని గ్రామాలకు కచ్చితంగా బీటీరోడ్లు ఉండేలా రహదారుల వ్యవస్థను నిర్మించాలి. గ్రామాల్లో జరుగుతున్న పనులను అధికారులు ఎప్పటికప్పడు ఆకస్మికంగా తనిఖీ చేయాలి. పనులు జరుగుతున్నాయా లేదా అన్నది సమీక్షించాలి. నిధులు దుర్వినియోగం కాకాకుండా ప్రతి పైసా సద్వినియోగం అయ్యేలా చూసుకోవాలి. ఇలా చేస్తూ పోతే కొంతకాలానికైనా అభివృద్ధి కళ్లకు కనిపి స్తుందనడంలో సందేహం లేదు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి, రక్షించాలి. గుంతలు తవ్వడానికి, నీళ్లు పోయడానికి, ఇతరత్రా పనులకు ఉపాధి నిధులను పూర్తిగా వినియోగించుకోవాలి. అటవీశాఖ అధికారుల సలహాలు, సాంకేతిక సహకారంతో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. . మొక్కలు పెట్టడం, వాటిని రక్షించడం లాంటి బాధ్యతలు గ్రామ పంచాయతీలు చేపట్టాలన్న సూచనలు సర్పంచ్‌లకు స్ఫూర్తి కావాలి. ఎందరో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందారు. వారందరికి నిధులకు ఇబ్బంది లేకుండా ఉపాధి జోడింపు కావాలి. ఇకపోతే రహదారులు లేని గ్రామాలు అనేకం ఉన్నాయి. విద్యుత్ లేని గ్రామాలు ఉన్నాయి. అలాంటి గ్రామాల సర్పంచ్‌లు చొరవ తీసుకుని ముందుకు సాగాలి. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు కచ్చితంగా బీటీ రోడ్లు ఉండాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలి. దరిమిలా వీరంతా తమ గ్రామాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. వీటికోసం వెంటనే ప్రతిపాదనలు తయారుచేసి, పనులు ప్రారంభించేలా

కార్యక్రమాలు రూపొందాలి. అప్పడే గ్రామీణ నిరుపేదలకు కూలీ కల్పించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకం లక్ష్యం నెరవేరగలదు. ఇంతకాలం సిబ్బంది నిర్లక్ష్యం.. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేమితో ఉపాధి పథకం నీరుగారి పోతోంది. ఓ పక్క గ్రామాల్లో కూలీ దొరక్క అల్లాడుతున్న పేదలకు నిరాశను మిగిలిస్తోంది. కూలీ దొరకడం లేదని కూలీలు అంటున్నారు. కూలీలు దొరక్క అసవ్థలు పడుతున్నామని రైతులు అంటున్నారు. గ్రామాల్లో ప్రజలు కూడా ఇదే బాధను వ్యక్తం చేస్తున్నారు. మరి వీరంతా ఏమవుతున్నారు. ఎక్కడ లోపం ఉంది. ఎక్కడ సమన్వయం లోపించింది. అన్నదే అంతుచిక్కని వ్యవహారంగా ఉంది. ప్రధానంగా కేంద్ర,రాష్ట్రాల మధ్య సమన్వయం కుదరడం లేదు. పనుల విషయంలో ప్రణాళికలు లేవు. వేలాది కోట్లు ఉపాధిహామీలో వెచ్చిస్తున్నా బూడిదలో పోసిన పన్నీరులా తయారయ్యింది. గ్రామాల్లో పనులు దొరక్క.. చేతిలో డబ్బులు లేక..నిత్యావసర సరకులు కొనలేక ఇబ్బందులు పడుతున్న అనేకమంది పేదలకు పనులు కల్పించి ఆర్థిక భరోసా అందించాలనే ఉద్దేశంతో కేందప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రారంభంలో కొన్ని పనులకే పరిమితమైన ఈ పథకం.. 52రకాల పనులకు ఈ పథకాన్ని వర్తింపజేసింది. గ్రామాల్లో నీటి సంరక్షణ కోసం చేపడుతున్న పనులు, వ్యవసాయ బావుల నిర్మాణం, ఇంకుడుగుంతలు, మట్టికట్టలు, బావుల పూడికతీత, నాడేపు కంపోస్టు, వర్మీకంపోస్టు నిర్మాణాలు, వంట గదులు, పాఠశాలల మరుగుదొడ్లు, శ్మశానవాటికలు తదితర వాటిని చేపట్టాల్సి ఉంది. పనులు చాలా ఉన్నప్పటికీ.. వాటిని చేయించడంలో గ్రామీణ స్థాయిలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తు న్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పాటు ప్రభుత్వం నుంచి ఉపాధిహామీ డబ్బులు సైతం సకాలంలో రాకపోవడంతో కూలీలు ఈ పనులకు వెళ్లేందుకు అనాసక్తి చూపుతున్నట్లు సమాచారం. పనులకు సాంకేతికత కూడా తోడుకావడంతో నిబంధనల మేరకు పనులు చేయాల్సి ఉంటుంది. ఆయా గ్రామాల సర్పంచ్‌ల ప్రతిభ,పట్టుదల తోడైతే ప్రగతి సాధ్యం కాగలదు. అందుకు సత్వరంగా ఉపాధిహామీ విధివిధానాలను మార్చుకుంటే మంచిది.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# మూడోవ రోజు అసెంబ్లీ సమావేశాలు

## అభివృద్ధి సంక్షేమం లక్ష్యంగా తెలంగాణ బడ్జెట్



(మొదటి పేజీ తరువాయి) హైదరాబాద్,ఫిబ్రవరి6(సమసమాజం): తెలంగాణ ఆచరిస్తోందని, దేశం అనుసరిస్తోందన్న స్థాయిలో రాష్ట్రం దూసుకపోతుందని ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు తెలిపారు. అభివృద్ధి,సంక్షేమానికి తమది పెద్దపీట అని ప్రభుత్వం రుజువు చేసుకుంది. కేంద్రం మోకాలడ్డుతున్నా.. అనేక పథకాలకు నిధలు కేటాయింపుతో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో పరుగు పెట్టిస్తూ..దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. అసెంబ్లీలో ఆర్థిక మంత్రి హరీష్ రావు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంక్షోభ సమయంలోనూ సంక్షేమం ఆగలేదని, అన్ని సామాజిక వర్గాల ఆకాంక్షలకు అనుకూలంగా సమగ్రాభివృద్ధి చేశామన్నారు. తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉండేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత జీఎస్‌డిపి క్రమేణా పెరుగుతూ వచ్చిందన్నారు. తెలంగాణ అభివృద్ధి మోడల్ గురించి ఊరురూవాడ చర్చ జరుగుతోందన్నారు.2019-20 సంవత్సరానిని జీఎస్‌డిపి వృద్ధి రేటు 13.2 శాతానికి పెరిగిందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ అత్యధికంగా తలసరి ఆదాయం 11.8 శాతం వృద్ధిరేటును నమోదు చేసిందని హరీష్ రావు ప్రశంసించారు. దేశ జిడిపిలో తెలంగాణ జిడిపి శాతం 4.9 కావడం గర్వకారణమని కొనియాడారు. తెలంగాణ ఏర్పడిన తరువాత ప్రధాన రంగాల్లో అనుబంధ రంగాల్లో గణనీయమైన వృద్ధి రేటు కనిపించిందన్నారు. నీటి పారుదల ప్రాజెక్టుల వల్ల వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో మెరుగైన వృద్ధి రేటు కనిపించిందని వివరించారు. అన్ని రంగాల్లో పెట్టుబడులు పెరగడం వల్లనే ఈ వృద్ధి రేటు సాధ్యమైందని, జాతీయ తలసరి ఆదాయం కంటే తెలంగాణ తలసరి ఆదాయం 86 శాతం ఎక్కువగా ఉందని ఆయన తెలియజేశారు. తలసరి ఆదాయం రూ.3,17,155గా అంచనా వేశామన్నారు. 2023-24 అంచనాల ప్రకారం రాష్ట్ర నికర అప్పులు రూ.3,57,059 కోట్లుగా ఉండగా అప్పుల శాతం 23.8 శాతంగా ఉంది. రాష్ట్ర బ్జడెట్ అంచనాలను రూ.2,90,396 కోట్లుగా మదింపు చేశారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,11,685 కోట్లు కాగా, రెవెన్యూ రాబడుల అంచనా రూ.2,16,566 కోట్లుగా మంత్రి తెలిపారు. సొంత పన్నుల ఆదాయం: రూ.1,31,028 కోట్లు,కేంద్ర పన్నుల్లో వాటా రూ.21,470 కోట్లు,రుణాలు రూ.46,317 కోట్లు,పన్నేతర ఆదాయం రూ.22,808 కోట్లు, గ్రాంట్లు అంచనా రూ.41,259 కోట్లుగా అంచనా వేశారు. సొంత జాగా ఉండి ఇల్లు లేని వారికి తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. సొంత జాగాలో ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. దీనికోసం రూ.7,890 కోట్లు కేటాయించినట్టు బ్జడెట్ ప్రసంగంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ వెల్లడించారు. ఇకపోతే సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు ప్రతి నియోజకవర్గంలో 2 వేల మందికి రూ.3 లక్షల చొప్పున సాయం అందిస్తామని ప్రకటించారు. సీఎం కోటాలో 25వేల మందికి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. మొత్తంగా 2 లక్షల 63 వేల మందికి 7890 కోట్లు అందించనున్నట్టు పేర్కొన్నారు. ఇక డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం రూ.12వేల కోట్లు కేటాయించారు. ఈసారి బ్జడెట్‌లో కూడా ప్రభుత్వం వ్యవసాయంతో పాటు సంక్షేమానికి కూడా పెద్ద పీట వేసింది. విద్య, వైద్యానికి ఎప్పటిలాగా ప్రధాన్యతనిచ్చింది. కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్, దళితబంధు పథకాలకు భారీగా నిధులు కేటాయించింది. పల్లెప్రగతి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు నిధులు కేటాయించింది. ఒకప్పుడు సంక్షోభంలో కూరుకుని అల్లాడిన తెలంగాణ వ్యవసానికి తిరిగి జవజీవాలను అందించడంలో, నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడే రైతుల్లో తిరిగి ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా సఫలీకృతమైందని మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వ అసాధారణ కృషితో నేడు సుజల, సుఫల, సస్యశ్యామల తెలంగాణగా అవరించిందని చెప్పారు. 2023-24కుగాను రూ.2,90,396 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. వ్యవసాయ శాఖకు రూ.26,831 కోట్లు కేటాయించారు. ఇందులో రుణమాఫీ పథకానికి రూ.6385 కోట్లు, రైతుబంధుకు రూ.15,075 కోట్లు, రైతు బీమాకు రూ.1,589 కోట్లు, ఆయిల్‌పామ్ సాగుకు రూ.వెయ్యి కోట్లు కేటాయించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు పదేండ్లలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు అప్పటి ప్రభుత్వాలు రూ.7994 కోట్ల నిధులు ఖర్చు చేశాయని, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2023 జనవరి నాటికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం రూ.1,91,612 కోట్లు వెచ్చించిందని చెప్పారు. అంటే 20 రెట్లు నిధులు అధికంగా ఖర్చు చేసిందన్నారు. దేశ వ్యవసాయ వృద్ధిరేటు 4 శాతం కాగా, తెలంగాణలో అది 7.4 శాతంగా ఉందని చెప్పారు. 2014-15లో రాష్ట్రంలో మొత్తం పంటసాగు విస్తీర్ణం 131.33 లక్షల ఎకరాలు ఉండగా, ప్రభుత్వం తీసుకున్న వ్యవసాయ అభివృద్ధి చర్యల వల్ల సాగు విస్తీర్ణం 2020-21 నాటికి 215.37 లక్షల ఎకరాలకు చేరిందన్నారు. రాష్ట్రంలో వరి ఉత్పత్తి 3 రెట్లు పెరిగిందని చెప్పారు. 2014-15లో 68.17 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 2021-22లో 2కోట్ల 2 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుందన్నారు. 75 ఏండ్ల భారతదేశ చరిత్రలో 65 లక్షల మంది రైతులకు రూ.65 వేల కోట్ల భారీ మొత్తాన్ని పంటపెట్టుబడి సాయంగా అందించిన ఒకే ఒక ప్రభుత్వం తెలంగాణ సర్కార్ అని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు పథకం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుందన్నారు. రైతుబీమా పథకం రైతుల కుటుంబాలకు ఎనలేని ధీమా అందిస్తున్నదని వెల్లడించారు. ఏ రైతైనా మరణిస్తే.. మరణించిన నాటినుంచి 10 రోజుల్లోగా రూ.5 లక్షల బీమా సొమ్మును ప్రభుత్వం అతని కుటుంబానికి అందజేస్తున్నదని చెప్పారు. ఇప్పటివరకు దాదాపు లక్ష మంది రైతుల కుటుంబాలకు రైతుబంధు ద్వారా రూ.5384 కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. రైతు పండించిన ప్రతిగింజా ప్రభుత్వమే కొనుగోలుచేస్తున్నదని ప్రకటించారు. ఆయిల్‌పామ్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఆయిల్‌పామ్ సాగుద్వారా ప్రతి ఎకరానికి రూ.లక్షా 50 వేల వరకు నికర ఆదాయం వస్తుందన్నారు. అందువల్ల రాష్ట్రప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని 20 లక్షల ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నదని చెప్పారు.

# ఈటెలను ఆలింగనం చేసుకున్న ఎమ్మెల్యే మర్రి


## రాజకీయాలకన్నా బందాలే మిన్న అని వ్యాఖ్య



హైదరాబాద్,ఫిబ్రవరి6(సమసమాజం) అసెంబ్లీ అవరణలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. ఈటెలను కలుసుకున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి ఆలింగనం చేసుకున్నారు. బంధాల ముందు రాజకీయాలు బలాదూర్ అని నిరూపించారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజున బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ను దగ్గరకు వెళ్లి మరీ మంత్రి కేటీఆర్ పలకరించిన విషయం తెలిసిందే. ఇకసోమవారం సిఎల్పీ కార్యాలయాలు.. బిల్డింగ్ వైపు ఈటల వెళు తుండగా.. ఆయనను దూరం నుంచి టీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి విష్ చేశారు. ఈటల చూడకపోవడంతో జనార్ధన్ రెడ్డి దగ్గరకు వెళ్లి మరీ విష్ చేశారు. దీంతో ఈటల అవాక్కయ్యారు. ఈ నేపథ్యంలో ఈటల, మర్రిల మధ్య ఆసక్తికర సంభాషణ చోటు చేసుకుంది. తనను విష్ చేసిన మర్రి జనార్ధన్ రెడ్డితో ఈటల.. 'ఇక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నన్ను విష్ చేసే దైర్యం చేస్తారా?' అన్నారు. దీనికి మర్రి.. రాజకీయాలు వేరు.. మానవ సంబంధాలు వేరు. విష్ చేసే ధైర్యం ఎందుకు లేదంటూ ఈటల రాజేందర్‌ను మర్రి ఆలింగనం చేసుకున్నారు. అసలు ఇప్పుడు విలువలు ఎక్కడున్నాయని ఈటల ప్రశ్నించారు. వేడి నూనెలో వేయించి ఎలా ఉందని అడిగినట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక అక్కడే ఉన్న బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు సైతం వేర్వేరు పార్టీల నేతలు మాట్లాడుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. నేను పనుల కోసం హరీష్ రావును కలిస్తే బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు మీడియాలో వస్తోందన్నారు. అక్బరుద్దీన్ మిత్రులకు కేటీఆర్ అపాయింట్ మెంట్ ఇవ్వడం లేదన్నారు. వారి పని చేయడం సాధ్యం కాదని కేటీఆర్ మొహం చాటేస్తున్నారన్నారు. దీంతో అక్బరుద్దీన్‌కు మండి అసెంబ్లీలో కేటీఆర్‌పై ఘాటుగా ఆగ్రహం వ్యక్తం చేశారని రఘునందన్ రావు పేర్కొన్నారు.

# ఆదానికి అంతగా రుణాలు ఎలా ఇచ్చారు

## తిరుపతి ఎస్‌బిఐ ముందు చింతా ఆందోళన



తిరుపతి,ఫిబ్రవరి6(సమసమాజం): ఇంటర్ మాత్రమే చదివిన అదానీకి ష్యూరిటీ లేకుండా వేల కోట్ల రుణం ఎలా ఇచ్చారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత చింతా మోహన్ ప్రశ్నించారు. దీనిపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుపతి ఎస్‌బిఐ బ్రాంచి ముందు సోమవారం ఉదయం చింతా మోహన్ ఆందోళన చేపట్టారు. మోదీ స్నేహితుడు అదానీకి రాజకీయ పలుకుబడితో రూ.30వేల కోట్ల రుణాన్ని కట్టబెట్టారని చింతామోహన్ ఆరోపించారు. అదానీ ఒక్కడి వల్ల దేశవ్యాప్తంగా 24వేల బ్రాంచులు ఉన్న ఎస్‌బీఐ దివాళా తీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నిర్మలా సీతారామన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను అదానీ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌ను అదానీ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌గా మార్చేయండి అంటూ ఎద్దేవా చేశారు.

# కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలి




## ఎపిలో అండన్వాడీల ఆందోళన

## కలెక్టరేట్ల ముందు ధర్నాలు



విజయవాడ,ఫిబ్రవరి6(సమసమాజం): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల కలెక్టరేట్ల వద్ద పెద్దయెత్తున అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు. కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని, జీవో నెంబర్ 1 ను తక్షణమే రద్దు చేయాలని, ప్రమోషన్లు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అధికారులు, రాజకీయ నాయకుల వేధింపులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలు ఇవ్వాలి, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలి, సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సం॥లకు పెంచాలి. ప్రమోషన్లో రాజకీయ జోక్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. 100 జనాబా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. మినీ సెంటర్లోని వర్కర్లను మెయిన్ వర్కర్లుగా తీసుకోవాలని, అదనంగా హెల్పర్ను నియమించాలని, ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని, అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలని, అంగన్వాడీలకు జాబ్ క్యాలండర్ నిర్ణయించాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెంటర్లను బలోపేతం చెయ్యడానికి నిధులు పెంచి అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల పర్యవేక్షణ చేయాలని, ఫుడ్ కమిషనర్, ఎం.ఎస్.కె, ఎం.ఆర్. ఓ,ఎం.డి.ఓ. రాజకీయ నాయకులు ఇలా అనేక మంది విజిట్ల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలౌతున్నారన్నారు. కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్లో జరిగిన ఈ ఆందోళనలో సిఐటియు ఆలిండియా ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా కార్యదర్శి సిహెచ్.రాజ్ కుమార్, యూనియన్ జిల్లా కార్యదర్శి ఈ.చంద్రావతి మాట్లాడుతూ... అంగన్వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, వాటిని పరిష్కరించాలని న్యాయబద్ధంగా అడిగితే అక్రమంగా అరెస్టులు చేయడం శోచనీయమన్నారు. సమస్యలపై అంగన్వాడీలు చేసిన నినాదాలు మర్మోగాయి. ఈ ఆందోళనకు వివిధ ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

# బీఆర్ఎస్ ప్రభుత్వపు ప్రగల్బాల బడ్జెట్

## రాష్ట్ర బడ్జెట్ పై స్పందించిన ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్,ఫిబ్రవరి6(సమసమాజం): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఏలేటి మహేశ్వర్ రెడ్డి తనదైన శైలిలో స్పందించారు. సోమవారం అసెంబ్లిలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయి ంపులు ఆర్థిక వాస్తవ పరిస్థితులకు విరుద్దంగా ఉన్నాయి అని విమర్శించారు గత బడ్జెట్‌లో పలు శాఖలకు భారీగా నిధులు కేటాయించామని చెప్పుకున్నారు కాని నిధుల విడుదల ఖర్చు సంగతీ మరిచారు. అంచనాల బడ్జెట్‌లో నిధుల కేటాయింపుకు, సవరణ బడ్జెట్‌లో నిధుల ఖర్చుకు మధ్య బంగాళఖాతమంత దూరం ఉంటోంది. గత బడ్జెట్ అమలును పరిగణలోకి తీసుకుంటే ఈ బడ్జెట్‌కు విశ్వనీయత లేదనిపిస్తోంది. బీఆర్ఎస్ నేతలు గొప్పులు చెప్పుకోవడం తప్పా, నిధులు ఖర్చు చేసి ప్రజలకు మేలు చేసే పరిస్థితులే కనిపించడం లేదని అన్నారు.

# గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు



జనగామ,ఫిబ్రవరి6(సమసమాజం): గ్రామాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీలు ఏర్పాటు చేసింది. వర్షాలు పడే నాటికి మొక్కలు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. 11 లక్షల 40 వేల మొక్కలు పెంచి హరితహారంలో ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. మండలంలోని పలు నర్సరీల ఏర్పాట్లను అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. ఇప్పటికే పలు నర్సరీల్లో మొక్కల పెపంపకం చేపట్టారు. అధికారులు క్షేత్ర సహాయకులకు పలు సూచనలు చేశారు. నర్సరీ చుట్టూ కంచె ఉండాలని, ప్రతి రోజూ రెండుసార్లు నీరు పోయాలని తెలిపారు.

# హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ



(మొదటి పేజీ తరువాయి) జరగనప్పటికీ ఈడీ కేసు నమోదు చేయడం చెల్లదని ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈడీ దాఖలు చేసిన కౌంటర్‌కు సమాధానం ఇవ్వడానికి సమయం ఇవ్వాలని రోహిత్‌రెడ్డి తరపు న్యాయవాది హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. దీంతో విచారణ ఫిబ్రవరి 20కి వాయిదా వేసింది. ఎమ్మెల్యేలకు ఎరకేసులో సిబిఐ దర్యాప్తునకే హైకోర్టు తలొగ్గింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసు దర్యాప్తును సీబీఐకు బదిలీ చేస్తూ సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించింది. కేసును సీబీఐకు అప్పగించొద్దంటూ ప్రభుత్వం, బీఆర్ఎస్ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి దాఖలు చేసిన అప్పీళ్లను న్యాయస్థానం కొట్టివేసింది. సింగిల్ జడ్జి తీర్పును తప్పుబట్టలేమని, అందులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ టి.తుకారాంజీలతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉందని, అందుకే తీర్పును 15 రోజుల పాటు అమలు చేయకుండా చూడాలని అడ్వొకేట్ జనరల్ సీజే ధర్మాసనాన్ని కోరారు. అయితే ఏజీ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. 2022 అక్టోబర్ 26వ తేదీన మొయినాబాద్ ఫాంహౌస్ లో తమను ప్రలోభాలకు గురి చేశారంటూ అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కంప్లైంట్ ఆధారంగా కేసు నమోదుచేసిన పోలీసులు రామచంద్రభారతి, సింహయా జీ, నందకుమార్ లను అరెస్ట్ చేశారు. ఫాం హౌస్ కేసు దర్యాప్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. అయితే సిట్ దర్యాప్తు పారదర్శకంగా జరగడంలేదని, అందుకే కేసును సీబీఐకి అప్పగించేలా ఆదేశించాలంటూ నిందితులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి బెంచ్ 2022 డిసెంబర్ 26న సిట్ ను రద్దు చేయడంతో పాటు కేసును సీబీఐకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ జడ్జి ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి4న హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం రాతపూర్వక వాదనలు సమర్పించేందుకు జనవరి 30 వరకు రాష్ట్ర ప్రభుత్వానికి గడువు ఇచ్చింది. ఈ రోజు కేసు విచారణ జరిపిన న్యాయస్థానం సింగిల్ జడ్జి బెంచ్ ఉత్తర్వులను సమర్థిస్తూ తీర్పు వెలువరించింది.

# టర్కీ, సిరియాలను కుదిపిన భారీ భూకంపం

(మొదటి పేజీ తరువాయి) దూరంలో 18 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భూకంపం సంభవించిన పావుగంట తర్వాత 6.7 తీవ్రతతో మరోసారి శక్తిమంతమైన ప్రకంపనలు చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారన్నారు. మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశమున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. టర్కీలోని మలట్యా, ఉర్ఫా, ఒస్మానియో, దియర్‌బకీర్ ప్రాంతాల్లో భూకంప ప్రభావం అధికంగా ఉంది. సిరియాలో అలెప్పో, హమా, లటాకియాలో అనేక భవనాలు నేలమట్ట మయ్యాయి. 200 మందికి పైగా గాయపడినట్లు ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. భూకంప ప్రభావి త ప్రాంతాల్లో సహా యక చర్యలు కొనసాగు తున్నాయి. టర్కీలో ని దియర్ బకీర్ ప్రాం తంలో ఓ భవనం పేక మేడలా కుప్ప కూలిన దృశ్యా లు సోషల్ మీడియాలో వైరల్ అవుతు న్నాయి. ఇక హతయ్ ప్రాంత ంలో భూకంప తీవ్రతకు సహజవాయువు గ్యాస్ పైప్లైను పేలి భారీగా మంటలు చెలరేగాయి. టర్కీలో తరచూ భూకంపాలు సంభవిస్తుంటాయి. 2020 జనవరిలో ఇలాజిగ్ ప్రాంతంలో 6.8 తీవ్రతతో భూకంపం సంభవించి 40 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అదే ఏడాది అక్టోబరులో 7.0 తీవ్రతతో సంభవించిన భూకంప విలయంలో 114 మంది మృత్యువాతపడ్డారు. ఇక, 1999లో టర్కీ చరిత్రలో అత్యంత భీకర ప్రకృతి బీభత్సాన్ని చవిచూసింది. ఆ ఏడాది 7.4తీవ్రతతో భూకంపం సంభించి 17వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఒక్క ఇస్తాంబుల్‌లోనే 1000 మంది మరణించారు. టర్కీని భారీ భూకంపం కుదిపేసింది. దక్షిణ టర్కీలోని గజియాన్‌టెప్ సమీపంలో శక్తివంతమైన భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.8గా నమోదైంది. పలు భవానాలు కుప్పకూలడంతో సుమారు 50 మంది మరణించినట్టు రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. విధ్వంస తీవ్రత ఆధారంగా మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. నరుద్గీకి 23 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో 10 కిలోమీటర్ల లోతులో కదలికలు సంభవించినట్టు యూజి జియాలాజికల్ సర్వే తెలిపింది. భూకంప తీవ్రతకు పలు ప్రాంతాల్లో భవనాలు, అపార్ట్‌మెంట్లు కూలిపోయాయని, భారీ ఆస్తినష్టం జరిగినట్టు వార్తలు వెలువడ్డాయి. ప్రజలు హాహాకారాలు చేస్తూ రోడ్లపైకి పరుగులు తీశారు. భారీ భూకంపం తర్వాత హైఅలర్ట్ ప్రకటించినట్టు టర్కీ అంతర్గత మంత్రిత్వ శాఖ తెలిపింది. సిప్రస్, టర్కీ, గ్రీస్, జోర్డాన్, లెబనాన్, సిరియా, యూకే, ఐరాక్, జార్జియాలోనూ భూకంపం సంభవించింది. ఉత్తర నగరం అలెప్పో, సెంట్రల్ సిటీ హమాలో కొన్ని భవనాలు కుప్పకూలినట్లు సిరియా ప్రభుత్వ మీడియా పేర్కొంది. ప్రాణనష్టంపై ఎలాంటి సమాచారం లేదు. బీరూట్, డమాస్కస్‌లలో అపార్ట్‌మెంట్లు, భవనాలు కంపించడంతో స్థానిక ప్రజలు భయంతో వీధుల్లోకి పరుగులు తీశారు. మృతుల వివరాలు వెంటనే తెలియలేదు. టర్కీలో గత మూడేళ్లలో 18 మంది భూకంపాల కారణంగా మరణించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈశాన్య టర్కీలో 1999లో సంభవించిన భారీ భూకంపంలో 17,000 మందికి పైగా మరణించారు. టర్కీలోని 10 నగరాలపై భూకంప ప్రభావం ఉన్నట్టు టర్నీ దేశీయాంగ మంత్రి సులేమాన్ సోయిల్ తెలిపారు. గజియాన్‌టెప్, కహ్రమాన్‌మరస్, హటాయ్, ఒస్మానియె, అడియమన్, మలట్యా, అదన, కిలిస్ తదితర సిటీలపై ఈ ప్రబావం ఎక్కువగా ఉందన్నారు. గజియాన్‌టెప్‌లోని షాపింగ్ మాల్ కుప్పకూలినట్టు బీబీసీ టర్కీ కరస్పాండెంట్ తెలిపారు. తాను ఉంటున్న భవనం సుమారు 45 నిమిషాలు కుదుపులకు గురైందని బీబీసీ ప్రొడ్యూసర్ రుష్ది అబ్దాలాఫ్ తెలిపారు. భూకంపం తీవ్రత 7.4గా టర్కీ భూకంప నమోదు నిపుణులు అంచనా వేశారు.



# బడ్జెట్‌లో మంత్రి హరీష్ రావు అంకెలగారడి



(మొదటి పేజీ తరువాయి) **హైదరాబాద్,ఫిబ్రవరి6(సమసమాజం):** తెలంగాణ బడ్జెట్‌లో మంత్రి హరీష్ రావు అంకెలగారడి, మాయమాటలు తప్ప ఏమిలేవని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. శ్రీధర్ బాబు,జగ్గారెడ్డి, జీవన్ రెడ్డిలతో కలసి ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని భట్టి ఆరోపించారు. ఎన్నికల సమయం వచ్చేసరికి.. హామీలతోనే కాలం వెళ్లదీస్తున్నారని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో బలహీన వర్గాలకు ఒరిగిందేమీ లేదన్న భట్టి.. 8 ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రుణమాఫీ ఎక్కడ అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సందర్భం వచ్చిన ప్రతిసారి అధికార పార్టీ నేతలు 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెబుతున్నారని, కానీ, 5 గంటలు కూడా కరెంట్ రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లిక్కర్ ఆదాయం ఒక్కటే భారీగా కనిపిస్తోందని.. నిరుద్యోగ భృతి, గిరిజన బంధు ఏమైనాయని భట్టి నిలదీశారు. నీళ్లు, నిధులు, నియామకాలు ఎక్కడ అని ప్రశ్నించారు. కృష్ణా జలాలకు సంబంధించి ప్రాజెక్టుల మాటే లేదని.. ఎవరో అధికారులు రాసిస్తే దాన్ని హరీష్ రావు చదివారని భట్టి ధ్వజమెత్తారు. విద్యార్థులను గాలికి వదిలేశారన్నారు. ఇక రుణమాఫీ నిధులు ఏమయ్యాయని ప్రభుత్వం పై భట్టి ప్రశ్నల వర్షం కురిపించారు.

# అసెంబ్లీ బుధవారానికి వాయిదా



(మొదటి పేజీ తరువాయి) **హైదరాబాద్,ఫిబ్రవరి6(సమసమాజం):** శాసనసభ, శాసన మండలి సమావేశాలు బుధవారానికి వాయిదా పడ్డాయి. హరీష్ రావు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రసంగం ముగిసిన అనంతరం శాసనసభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. ఈ నెల 8న బడ్జెట్‌పై చర్చ జరగనుంది. 9,10, 11 తేదీల్లో బడ్జెట్ పద్దులపై చర్చించనున్నారు. 12వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించ నున్నారు. అనంతరం సమావేశాలు వాయిదా పడనున్నాయి. ఈ నెల 3వ తేదీన బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అలాగే మండలి కూడా వాయిదా పడింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి హరీశ్‌రావు శాసనసభలో ప్రవేశపెట్టారు. హరీశ్‌రావు బడ్జెట్ ప్రసంగం 1 గంట 44 నిమిషాల పాటు కొనసాగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం ఎనిమిదిన్నరేండ్ల స్వల్పకాలంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా రూపుదిద్దుకున్నది. ప్రజాసంక్షేమంలోనూ అభివృద్ధిలోనూ యావత్ దేశానికి ఆదర్శప్రాయంగా నిలిచింది. తెలంగాణ ఆచరిస్తుంది దేశం అనుసరిస్తుంది అని చెప్పుకునే స్థాయికి చేరుకున్నది. ఇది రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణం. మానవీయమైన దృక్పథం, నిర్మాణాత్మకమైన ఆలోచన, దార్శనికమైన ప్రణాళికా రచన, పారదర్శకమైన పరిపాలన వీటన్నిటి మేలు కలయిక అయిన తెలంగాణ మోడల్ నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన్ననలు పొందుతున్నదని తెలుపుతూ హరీశ్‌రావు తన బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించారు. రానున్న రోజుల్లోనూ జాతి నిర్మాణంలో తెలంగాణ మరింత ఉజ్వల పాత్రను నిర్వహించే విధంగా పురోగమిస్తుంది.. దళితులు, గిరిజనులు, మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, అగ్రవర్ణ పేదలు అందరి జీవితాల్లో సంపూర్ణమైన వికాసాన్ని సాధించేంత వరకు విశ్రాంతి, విరామం ఎరుగక పరిశ్రమిస్తూనే ఉందాం.. ప్రగతి ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉందాం. ఇందుకోసం రాజీలేని మార్గాన్ని అనుసరిస్తామని, ఈ మహా సంకల్పానికి సంపూర్ణమైన అండదండలు అందించాలని తెలంగాణ ప్రజానీకాన్ని సవినయంగా కోరుతున్నాను అని మంత్రి హరీశ్‌రావు తన బడ్జెట్ ప్రసంగాన్ని ముగించారు. చివరగా జై తెలంగాణ.. జై హింద్ అని నినదించారు.

# పార్లమెంట్‌ను కుదిపేస్తున్న ఆదానీ వ్యవహారం



(మొదటి పేజీ తరువాయి) **న్యూఢిల్లీ,ఫిబ్రవరి6(సమసమాజం):** అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీల అవినీతి, అక్రమాలపై చర్చ జరుపాలంటూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళనలతో పార్లమెంట్ ఉభయసభలు దద్దరిల్లాయి. అదానీ గ్రూప్‌లో అవకతవకలను వెలికితీయడానికి జాయింట్ పార్లమెంటరీ కమిటీ జేపీసీని ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. కానీ, లోక్‌సభలో స్పీకర్‌గానీ, రాజ్యసభలో చైర్మన్‌గానీ వారి డిమాండ్లను అంగీకరించలేదు. దాంతో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. లోక్‌సభలో స్పీకర్ పోడియంలోకి, రాజ్యసభలో వెల్‌లోకి దూసుకెళ్లి ఎంపీలు ఆందోళనకు దిగారు. ఇలా పోడియంలోకి దూసుకొచ్చి ఆందోళన చేయడం భారతీయ సాంప్రదాయం కాదని స్పీకర్ ఓంబిర్లా వారించినా సభ్యులు వినిపించుకోలేదు. అటు రాజ్యసభ కూడా విపక్ష సభ్యుల నినాదాలదో మార్మోగింది. ఈ క్రమంలో పార్లమెంటు ఉభయసభలు మధ్యాహ్నం 2.00 గంటల వరకు వాయిదాపడ్డాయి. వాయిదా అనంతరం సభలు ప్రారంభమైనప్పటికీ అదే పరిస్థితి కొనసాగింది. లోక్‌సభలో, రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపీల నినాదాల జోరు కొనసాగింది. రాజ్యసభలో ఎవరి స్థానాల్లోకి వాళ్లు వెళ్లాలంటూ చైర్మన్ ధన్‌కడ్ చేసిన విజ్ఞప్తిని ఎవరూ లెక్కచేయలేదు. దాంతో ఉభయసభలు రేపటికి వాయిదాపడ్డాయి. వరుసగా మూడ్రోజులు పార్లమెంట్ ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే ఆదానీ వ్యవహారంపై అట్టుడికింది.



# బడ్జెట్‌లో అన్ని వర్గాలకు అన్యాయం

## నిధులు కేటాయించలేదన్న కోదండరామ్



**హైదరాబాద్,ఫిబ్రవరి6(సమసమాజం):** రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. డబుల్ బెడ్ రూం, దళితులకు మూడెకరాల భూమి తదితర పథకాలకు నిధులు కేటాయించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. రుణ సాయం, మార్కెటింగ్ విధానాలు, పంట నష్టానికి పరిహారం అందక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని.. ఇలాంటి వాటి కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని అన్నారు. బడ్జెట్‌లో రోడ్లు, బిల్డింగులు, ఇరిగేషన్ కు ఎక్కువ నిధులు కేటాయించారన్న ఆయన అవి కాంట్రాక్టు కమిషన్ల కోసమేనని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిందని ప్రభుత్వం అబద్దాలు చెబుతోందని కోదండరాం విమర్శించారు. తనతో వస్తే కాళేశ్వరం పూర్తికాలేదని నిరూపిస్తానని సవాల్ విసిరారు. పథకాలు భారీగా ప్రకటిస్తున్నా.. వాటి అమలు మాత్రం ముందుకు సాగడం లేదని కోదండరాం ఆరోపించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాల కోసం స్కిల్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగం పూర్తిగా నాశనమైందని, మౌలిక సదుపాయాల కోసం ఆ శాఖకు కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవని చెప్పారు. చిరు ధాన్యాలకు ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ పెరుగుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం అలాంటి వాటిని పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ఎ÷-లాన్ నిధుల్లో 40 నుంచి 50 శాతం కోత విధించారన్న కోదండరామ్ కేటాయించిన బ్జడెట్ నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు.

# సిద్దిపేట సిఐ శ్రీనివాస్‌పై సస్పెన్షన్

## ఉద్యోగంలో చేరిన 9 నెలలకే వేటు

**సిద్ది పేట,ఫిబ్రవరి6(సమసమాజం):** సిద్దిపేట జిల్లా చేర్యాల సిఐగా బాధ్యతలు చేపట్టిన 9 నెలల్లోనే సిఐ శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను సస్పెండ్ చేస్తూ సిద్దిపేట సిపి ఉన్నతాధికారులు శ్వేత ఉత్తర్వులు జారీ చేశారు.కొద్దిరోజుల క్రితం చేర్యాల జడ్‌పిటిసి మల్లేశం హత్య జరిగిన రోజు సిఐ శ్రీనివాస్ అందుబాటులో లేరు. అదే రోజు చేర్యాల పోలీస్ స్టేషన్ లో దాదాపు గంటన్నరకు పైగా సిఐ రాక కోసం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి వేచి చూశారు. అయితే సిఐ ఎంతసేపటికి రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పని నిమిత్తం బయటకు వెళ్లారు అనుకున్న ఎమ్మెల్యే తరువాత ఆయన ఉన్నతాధికారుల అనుమతి లేకుండా తన సొంత పనుల కోసం బయటకు వెళ్లినట్లు తెలియడంతో మండిపడ్డారు. ఇదేనా సిఐ ప్రజలకు అందుబాటులో ఉండేది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలకే ఇంతగా వేచి చేసే పరిస్థితి నెలకొన్నప్పుడు ఇక ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఘటన జరిగినప్పుడు సిఐ అందుబాటులో లేకపోవడంతో గతంలో ఓసారి ఉన్నతాధికారులు సిఐకు మెమో జారీ చేశారు. అయినప్పటికీ సిఐ తన తీరు మార్చుకోలేదని ఎమ్మెల్యే అన్నారు. గత నెల 24న ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పొరుగు ప్రాంతానికి సిఐ వెళ్ళాడు. తిరుగు ప్రయాణంలో యాక్సిడెంట్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సిఐ తీరు మార్చుకోకపోవడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

# ఢిల్లీ మేయర్ ఎన్నికలో తొలగని ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి) **న్యూఢిల్లీ,ఫిబ్రవరి6(సమసమాజం):** కీలకమైన సీటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలో ప్రతిస్తంభన తప్పడం లేదు. ఎన్నిక వరుసగా మూడోసారీ వాయిదా పడింది. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. మేయర్ ఎన్నిక కోసం సభ్యులంతా సమావేశమవగా.. నామినేటెడ్ సభ్యులకు ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అనుతివ్వడంపై దుమారం రేగింది. ఈ నేపథ్యంలో ఇలాంటి వాతావరణంలో మేయర్ ఎన్నికలు నిర్వహించలేమని ప్రిసైడింగ్ అధికారి సత్య శర్మ తెలిపారు. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ హౌస్ వాయిదా పడింది. ఎన్నిక కోసం ఢిల్లీ మున్సిపల్ హౌస్ సోమవారం సమావేశమైన ప్పటికీ పాత ఘటనలే సభలో పునరావృతమ్యాయి. ఆప్ తీవ్ర నిరసనలతో సభకు అంతరా యం కలిగింది. గతంలో రెండు సార్లు ఎన్నిక వాయిదా పడి మూడోసారి సభ సమావేశమైంది. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నామినేట్ చేసిన 10 మంది ఢిల్లీ కౌన్సిలర్లు ఓటు వేసేందుకు అనుమతించడంతో ఆప్ విరుచుకు పడింది. దీంతో సభాకార్యక్రమాల్లో అంతరాయం



తలెత్తింది. కీలకమైన 18 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులలో ఆరుగురుని కూడా సోమవారం ఎన్నుకోవాల్సి ఉంది. తక్కిన 12 మందిని జోనల్ ఎలక్షన్స్ ద్వారా ఎన్నుకుంటారు. కాగా, కీలకమైన ఆరుగురు సభ్యుల ఎన్నికలో మూడు సీట్లు ఆప్ గెలుచు కోనుండగా, బీజేపీ రెండు సీట్లు దక్కుంచుకోనుంది. కీలకమైన ఆరో సీటు విషయంలోనే సభలో గలభా తలెత్తింది. నామినేట్ సభ్యులను ఓటింగ్‌కు అనుమతిస్తే బీజేపీకి ఆ సీటు దక్కే అవకాశం ఉంది. ఇది ఆప్‌కు ఆందోళన కలిగిస్తోంది. దీనిపై ఆప్ నిరసనకు దిగింది. ఢిల్లీ మున్సిపల్ యాక్ట్-1957 ప్రకారం తొలి మున్సిపల్ సమావేశాల్లో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఈనెల 6, 24 తేదీల్లో జరిగిన రెండు సమావేశాలు వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో ఈనెల 6న తిరిగి ఎన్నిక నిర్వహించేందుకు ఎల్జీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. 250 స్థానాలున్న ఢిల్లీ మున్సిపాలిటీకి గత డిసెంబర్ 4న ఎన్నికలు జరుగగా, డిసెంబర్ 7న ఫలితాలు వెలువడ్డాయి. ఆప్ 134 సీట్లు గెలుచుకుని, మేయర్ స్థానాన్ని దక్కించుకునేందుకు అవసరమైన సీట్లు గెలుచుకుంది. బీజేపీ 104 వార్డులు గెలుచుకుని రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ 9 సీట్లు గెలుచుకుంది. కాగా, ఆప్ తరఫున ఢిల్లీ మేయర్ అభ్యర్థిగా షెల్లీ ఒబెరాయ్ పోటీ పడుతున్నారు. బీజేపీ తరఫున రేఖా గుప్తా పోటీ చేస్తున్నారు. డిప్యూటీ మేయర్ పదవికి ఆప్ తరఫున అలెయ్ మొహమ్మద్ ఇక్బాల్, బీజేపీ నుంచి కమల్ బాగ్రి పోటీ పడుతున్నారు. మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు ఎంసీడీ స్టాండింగ్ కమిటీకి ఆరుగురు సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది.

# ప్రజలను మోసం చేసేలా బడ్జెట్



(మొదటి పేజీ తరువాయి) **హైదరాబాద్,ఫిబ్రవరి6(సమసమాజం):** ప్రజలను మోసం చేసే బడ్జెట్ తీసుకొచ్చారని బిజెపి ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. బడ్జెట్‌లో డాబుసరి తప్ప ప్రయోజకర అంశాలు లేవన్నారు. రైతాంగానికి రుణమాఫీ నాలుగేళ్లు అయినా చేయలేదని తెలిపారు. అత్యధిక ఎగవేత దళారులుగా రైతులపై ముద్ర పడుతుందన్నారు. రైతు రుణమాఫీపై ఊసే లేదని.. చేస్తారా లేదా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీ లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్‌పై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విరుచుకుపడ్డారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ... చెప్పేవి గొప్పలు చేసేవీ శూన్యం అన్నట్టుగా బడ్జెట్ ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగుల కు వేతనాలు మొదటి తేదీ రాకపోవడంతో ఈఎంఐలు సమయానికి చెల్లించలేకపోతున్నారన్నారు. మధ్యాహ్నం భోజనం వండే వారికి వెయ్యి రూపాయలు ఇస్తున్నారని.. అవి కూడా రెండేళ్ళకు ఓ సారి ఇస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కిట్ కు ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదన్నారు. అంగన్ వాడీ లకు డబ్బు సరిగా ఇవ్వక పోవడంతో ముక్కిపోయిన ఆహారం అందుతోందని బీజేపీ ఎమ్మెల్యే తెలిపారు. బాసర త్రిపుల్ ఐటీలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. గురుకులలో సరైన వసతులు లేవని.. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మన ఊరు మన బడి కేవలం చెప్పడానికే రంగు రంగులుగా కనిపిస్తుందని వ్యాఖ్యలు చేశారు. ఈహెచ్ఎస్ పేరుతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స ఇవ్వలేమంటున్నారని... ఆసుపత్రిలలో మందులు కూడా అందడం లేదన్నారు. విద్యార్థులకు... విదేశీ విద్యకు వెళ్లే వారికి సరైన సమయానికి డబ్బు రావడం లేదని తెలిపారు. కాంట్రాక్టర్లలకు ఏ శాఖలోనూ సమయానికి బిల్లులు రాక ఆత్మహత్య చేసుకున్నారని ఈటల రాజేందర్ అన్నారు.

# రెండు జట్లూ బలమైనవే

### అయినా కప్పు ఆస్ట్రేలియాదే: మహేల జయవర్ధనే



**ముంబై, ఫిబ్రవరి6(సమ సమాజం):** భారత్,అస్ట్రేలియా జట్ల మధ్య ఫిబ్రవరి 9 నుంచి బోర్డర్–గావస్కర్ ట్రోఫీ మొదలుకానుంది. నాగాపూర్ వేదికగా మొదలుకానున్న ఈ ట్రోఫీ కోసం ఇరు జట్ల ఇప్పటికే ప్రాక్టీస్ కూడా స్టార్ట్ చేశాయి. అయితే ఈ ట్రోఫీలో ఏ జట్టు విజయం సాధిస్తుందనే దానిపై శ్రీలంక మాజీ ఆటగాడు మహేల జయవర్దనే తన అంచనాలను వెల్లడించాడు. అన్ని విభాగాల్లో రెండు జట్లు బలమైనవే అని చెబుతూనే 2–1 తేడాతో సిరీస్‌ను ఆసీస్ సిరీస్ ను కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పాడు. ఈ సిరీస్ లో అస్ట్రేలియాకు భారత్ గట్టి పోటీని ఇస్తుందని అభిప్రాయపడ్డాడు. తొలిసారి 1996–97లో భారత్, అస్ట్రేలియా జట్ల మధ్య బోర్డర్ – గావస్కర్ ట్రోఫీ జరగగా, అప్పుడు దానిని టీమ్‌ఇండియా కైవసం చేసుకొంది. అలాగే 2016 – 17, 2018 –2019, 2020 – 2021 సీజన్లలోనూ భారత జట్టే ట్రోఫీని గెలుచుకొంది. ఈసారి ట్రోఫీని కూడా సొంతం చేసుకొంటే.. నాలుగు టెస్టుల సిరీస్‌ను వరుసగా నాలుగో సారి కూడా సొంతం చేసుకొన్న జట్టుగా భారత్ నిలువనుంది. ప్రస్తుతం ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత్, ఆస్ట్రేలియా తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

# చార్లెట్ ఎడ్వర్డ్స్‌కు చీఫ్ కోచ్ పదవి




**ముంబై, ఫిబ్రవరి6(సమ సమాజం):** మహిళల ఐపీఎల్ (డబ్ల్యూపీఎల్)లో ఫ్రాంచైజీలు ఖరారవడంతో సదరు జట్లు సిబ్బంది నియామకాల్లో మునిగిపోయాయి. ఇప్పటికే అదానీ గ్రూప్‌నకు చెందిన గుజరాత్ జట్టు మెంటార్‌గా మిథాలీ రాజ్‌ని ఎంపిక చేసుకోగా.. మరో సీనియర్ క్రికెటర్ జులన్ గోస్వామిని ముంబై ఇండియన్స్ నియమించుకుంది. మెంటార్‌షిప్‌తో పాటు బౌలింగ్ కోచ్‌గానూ జులన్ బాధ్యతలు నిర్వర్తిస్తుందని ఫ్రాంచైజీ యజమాని నీతా అంబానీ తెలిపింది. కాగా ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ చార్లెట్ ఎడ్వర్డ్స్ ముంబై చీఫ్ కోచ్‌గా నియమితురాలైంది. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ దేవికా పాల్షికర్ బ్యాటింగ్ కోచ్‌గా, తృప్తి భట్టాచార్య ముంబై జట్టు మేనేజర్‌గా వ్యవహరించనున్నారు.

# భారత్, పాక్‌ల కొనసాగుతున్న వివాదం

### వేదికల మార్పు విషయంలో మార్చిలో నిర్ణయం

### భారత్ తీరుపై మండిపడుతున్న మియాందాద్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి6(సమ సమాజం):** ఆసియా కప్ 2023 విషయంలో భారత్–పాకిస్థాన్ మధ్య వివాదం రోజురోజుకు ముదురుతోంది. ఈ ఏడాది ఆసియాకప్‌కు పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనుంది. అయితే, టోర్నీ కనుక పాకిస్థాన్‌తో జరిగితే భారత జట్టు అక్కడికి వెళ్లబోదని బీసీసీఐ కరాఖండిగా చెబుతోంది. అలాగైతే ఇండియాలో ఈ ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌లో తాము కూడా ఆడబోమని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తేల్చేసింది. ఈ నేపథ్యంలో ఆసియాకప్‌ను తటస్థ వేదికపై నిర్వహించాలని ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నెల 4న బహ్రెయిన్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ విషయం చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. గతేడాదిలానే టోర్నీని యూఏఈకి తరలించాలన్న చర్చ జరిగినట్టు సమాచారం. అయితే, వేదిక మార్పు విషయంలో మార్చిలో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ వివాదంపై తాజాగా పాకిస్థాన్ మాజీ కెప్టెన్ జావెద్ మియాందాద్ స్పందించాడు. పాకిస్థాన్‌కు ఇండియా మద్దతు అవసరం లేదని, సెప్టెంబరులో పాకిస్థాన్‌లో జరగనున్న ఆసియాకప్ కోసం భారత జట్టు రాకుంటే వచ్చిన ఇబ్బందేమీ ఉండదని తేల్చి చెప్పాడు. అలాగే, భారత్‌పై సంచలన వ్యాఖ్యలు చేస్తూ ఐసీసీపై మండిపడ్డాడు. ఆసియాకప్ కోసం పాకిస్థాన్‌లో పర్యటించబోనన్న భారత జట్టుపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఐసీసీని ప్రశ్నించాడు. తాను గతంలోనూ ఇదే విషయాన్ని చెప్పానని గుర్తు చేశాడు. భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించకుంటే పోనివ్వాలని, దానివల్ల తమకొచ్చే ఇబ్బందేమీ లేదన్నాడు. భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించేలా చేయడం ఐసీసీ విధి అని, అది ఆ పని చేయలేకపోతే ఐసీసీ ఉండి ఉపయోగం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశాడు. భారతదేశం ఒక పవర్ హౌస్ అయితే కావొచ్చని, కానీ అది క్రికెట్‌ను శాసించలేదని మియాందాద్ అన్నాడు. ఆ జట్టు బలమైనదే అయితే అది దానికి గొప్ప కానీ తమకు, ప్రపంచానికి కాదన్నాడు. పాకిస్థాన్ వచ్చి క్రికెట్ ఆడాలని, అసలు ఎందుకు ఆడరని ప్రశ్నించాడు. పాకిస్థాన్‌లో కనుక భారత జట్టు ఓడిపోతే అక్కడి ప్రజలు అది సహించలేరని, అందుకే ఆ జట్టు రావడానికి భయపడుతోందని మియాందాద్ ఎద్దేవా చేశాడు. కాగా, 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ హక్కులను కూడా పాకిస్థాన్ సొంతం చేసుకుంది.



# 9 నుంచి ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల సిరీస్

### రోహిత్ కెప్టెన్సీకి పరీక్ష కాబోతున్న టెస్ట్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి6(సమ సమాజం):** ఈనెల 9 నుంచి ఆస్ట్రేలియాతో నాలుగు టెస్టుల సిరీస్ ఆరంభం కాబోతుంది. ఈ మ్యాచ్‌లు కచ్చితంగా రోహిత్ శర్మ నాయకత్వ ప్రతిభకు గీటురాయిగా నిలువనున్నాయి. ఫిబ్రవరి 2022లో టీమిండియాకు మూడు ఫార్మాట్లలోనూ కెప్టెన్‌గా రోహిత్ శర్మ నియమితుడయ్యాడు. అప్పటి వరకు కోహ్లీ గైర్హాజరీలోనే బాధ్యతలు తీసుకున్న అనుభవం ఉంది. తాజాగా కెప్టెన్ హోదాలో రోహిత్ అత్యంత కీలక పరిస్థితిని ఎదుర్కొనబోతున్నాడు. ఎందుకంటే ఇప్పటికే రోహిత్ ఆధ్వర్యంలో ఆసియాకప్, ఐసీసీ టీ20 వరల్డ్‌కప్‌లో చేదు ఫలితాలు వచ్చాయి. దీనికితోడు అతడి ముందు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ కూడా ఉంది. ఇందులో చోటు దక్కాలంటే ఆసీస్‌పై 2–0 లేక 3–1 తేడాతోనైనా భారత్ గెలవాల్సి ఉంటుంది. మరోవైపు 2004 నుంచి స్వదేశంలో కంగారూలపై భారత్‌దే ఆధిపత్యం. అంతేకాకుండా చివరి మూడు బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలను భారతే గెలుచుకుంటూ వస్తోంది. మరిప్పుడు కీలక ఆటగాళ్లు లేని వేళ జట్టును విజయం వైపు నడిపించే బాధ్యత రోహిత్‌పై ఉంది. రాబోయే నాలుగు టెస్టులతో పాటు అంతా సవ్యంగా జరిగితే డబ్ల్యుటీసీ్గ÷నైల్ ప్రదర్శన కూడా రోహిత్ కెప్టెన్సీ భవిష్యత్‌ను తేల్చనుంది. 2019 వరకు రోహిత్‌ను టెస్టు ఆటగాడిగా పరిగణించలేదు. ఆ తర్వాతే సుదీర్ఘ ఫార్మాట్‌లో స్థానం సుస్థిరం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో 1–2తో సిరీస్ ఓడాక కోహ్లీ టెస్టు కెప్టెన్సీ నుంచి తప్పు కోవడంతో రోహిత్‌కు పగ్గాలు అప్పజెప్పారు. దాంతో అన్ని ఫార్మాట్లలోనూ జట్టు నాయకుడిగా మారాడు. అయితే పూర్తి స్థాయి కెప్టెన్‌గా మారాక హిట్‌మ్యాన్‌ను గాయాలు వేధించాయి. దీంతో శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల్లో ఆడి జట్టుకు సిరీస్‌ను అందించాడు. మరోవైపు రోహిత్ ద్వైపాక్షిక సిరీ?సల్లో భారత జట్టును విజయవంతంగా నడిపించాడు. ఎందుకంటే టీమిండియా ఇప్పుడు వన్డే, టీ20ల్లో నెంబర్‌వన్‌గా కొనసాగు తున్న విషయం తెలిసిందే. కానీ వరల్డ్‌కప్‌లు గెలవకుండా టాప్ ర్యాంక్‌లో కొనసాగితే ప్రయోజనమేంటనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. రెండేళ్లలో మూడు టోర్నీల్లో జట్టు ఓటమిపాలైంది. 2013లో చివరిసారిగా జట్టు ఐసీసీ ట్రోఫీ గెలుచుకుంది.




# భారీ ప్రభాస్‌తో భారీ ప్రాజెక్టులు

### వరుస సినిమాలపై పెరిగిన అంచనాలు

బాహుబలి సిరీస్ తర్వాత ప్రభాస్ చిత్రాలకు ప్రేక్షకుల్లో విపరీతమైన క్రేజ్ వచ్చింది. దీంతో ఆయన సినిమాలను భారీగా తీర్చిదిద్దేందుకు దర్శక నిర్మాతలు ఆసక్తి కనబరుస్తున్నారు. అందుకోసం పెద్ద మొత్తంలోనే ఖర్చు పెడుతున్నారు. అలా ప్రభాస్ నుంచి ఆది పురుష్ సలార్ ప్రాజెక్ట్ కే మారుతి దర్శకత్వంలో ఓ సినిమా.. ఇలా వరుస భారీ బ్జడెట్ చిత్రాలు వస్తున్నాయి. వీటికోసం అభిమానులు తో పాటు దేశవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కానీ వీటి గురించి ఏ ఒక్కసారైనా సరైన అప్డేట్ రాలేదు. అంతలోనే ఎవరూ ఊహించని రేంజ్ లో మరో భారీ బ్జడెట్ సినిమా. అదే సిద్దార్థ్ ఆనంద్ –ప్రభాస్ ప్రాజెక్ట్. ఇప్పటికే ప్రకటించిన సినిమాలు ఎప్పుడు థియేటర్లో సందడి చేస్తాయా అనేది తెలియట్లేదు. నిజానికి ఒక్కో సినిమా విషయానికొస్తే.. వాటిలో ముందుగా ఆది పురుష్ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది అనే క్లారిటీ ప్రతి ఒక్కరిలో ఉంది. ఓం రౌత్ దర్శకత్వం లో రామాయణం ఆధారంగా భారీ స్థాయిలో రూపొందిన ఈ సినిమా తప్పకుండా ప్రభాస్ అభిమానులను ఎంతగానో ఆదరిస్తుంది అని చిత్ర బృందం చెబుతుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీచర్స్ పోస్టర్స్ ప్రేక్షకులను ఏమాత్రం ఆకట్టుకోలేదు. దింటో మూవీ టీం కొత్త హంగులను తీర్చిదిద్దుతూ.. ఈ ఏడాది జూలైలో విడుదలకు ప్రయత్నిస్తోంది. కానీ ఇది రిలీజ్ అయ్యే అవకాశం కనిపించడం లేదు. మరి ఈ చిత్రం ఏ స్థాయిలో ప్రేక్షకులను అలరిస్తుందో చూడాలి. ఇక ప్రభాస్–నాగ్ అశ్విన్ ల ప్రాజెక్ట్ కే రెండు భాగాలుగా రానుందని అంటూ ప్రచారం సాగుతోంది. 2024లో తొలి భాగం విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అయితే ఈ చిత్రం ప్రకటించి ఇప్పటికీ మూడేళ్లు అవుతున్నా కేవలం రెండు పోస్టర్లు మాత్రమే రిలీజ్ అయ్యాయి. అందులో ఒకటి టైరు రెండోది హ్యాండ్ పోస్టర్. ఇవి కూడా ఫ్యాన్స్ ను నిరాశ పెట్టాయి.మరో సినిమా సవాల్. కేజీఎఫ్ ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. పక్కా యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ గా రూపొందుతున్న ఈ సినిమా పైనా ప్రేక్షకులకు భారీ అంచనాలే ఉన్నాయి. కానీ ఈ చిత్రం కూడా ప్రకటించి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు మూడు పోస్టర్లు మాత్రమే రిలీజ్ చేసింది. ఇక ఈ మూవీ ని ఈ ఏడాది సెప్టెంబర్ లో రిలీజ్ చేస్తానని అంటున్నప్పటికీ ఇది కూడా డౌటే. ఇకపోతే మారుతితో మరో సినిమా. ఇందులో ఏకంగా ప్రభాస్‌కు ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నారు. అయితే దీని గురించి కనీసం ప్రకటన కూడా చేయలేదు కానీ షూటింగ్ జరుగుతుందని అంటున్నారు. మరి ఇది ఎప్పుడు వస్తుందో క్లారిటీ లేదు. అలా ప్రభాస్ నటిస్తున్న ఏ ఒక్క సినిమాపై స్పష్టత లేదు.ఏదేమైనప్పటికీ ప్రభాస్ కు బలమైన అపారమైన ఫ్యాన్ బేస్ వుంది. ఇక రాబోయే సినిమాలతోనే ప్రభాస్ భారీ హిట్ అందుకోవాలని ఆశిస్తున్నారు.



# సెట్టింగ్‌లో అడుగుపెట్టిన బుట్టబొమ్మ

మహేష్‌బాబు, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్ లో వస్తున్న సినిమా షూటింగ్ ఇప్పుడు హైదరాబాద్‌లో జరుగుతోంది. అయితే ఈ సినిమా షూటింగ్ మొదలెట్టిన దగ్గర నుంచీ ఏవో అవాంతరాలు వస్తూనే వున్నా, మొత్తానికి కొత్త సంవత్సరం లో షూటింగ్ అంతరాయం లేకుండా జరుగుతోంది. ఇప్పుడు ఇంకో ఆసక్తికర అంశం ఏంటి అంటే, ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న పూజ హెగ్డే ఈ షూటింగ్ సెట్లో అడుగు పెట్టింది. ఆదివారం ఈ సినిమా షూటింగ్ మాదాపూర్ లోనే ఒక ప్రయివేట్ ఆసుపత్రిలో జరిగినట్టుగా తెలిసింది. అప్పుడు పూజ హెగ్డే కూడా షూటింగ్ లో పాల్గొన్నట్లు తెలిసింది. ఇదే మొదటి సారి పూజ హెగ్డే ఈ సినిమా షూటింగ్ లో పాల్గొనటం. ఇందులో శ్రీ లీల కూడా ఇంకో కథానాయికగా నటిస్తోంది. అయితే ఆమె మహేష్ బాబు మరదలు రోల్ వేస్తోంది అని ఒక భోగట్టా. పూజ హెగ్డే నే మెయిన్ కథానాయిక అని, శ్రీ లీల కి వచ్చిన పాపులారిటీ ని బట్టి ఆమెని ఈ సినిమాలో తీసుకున్నారని కూడా తెలుస్తోంది. తరువాత ఒక వారం రోజుల పాటు మహేష్ లేకుండా వున్న సన్నివేశాలు కొన్ని దర్శకుడు త్రివిక్రమ్ చిత్రీకరించ నున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమాలో చాలామంది పాన్ ఇండియన్ నటులు వున్నట్టుగా కూడా తెలిసింది. ప్రకాష్ రాజ్ మహేష్ బాబు కి తాత గా ఇందులో కనిపించనున్నట్టు అనుకుంటున్నారు. హీరో మహేష్ బాబు ఇంటి సెట్ కూడా ఒకటి తయారవుతోందని అందులో ఇంక షూటింగ్ మొదలెడతారని కూడా తెలిసింది.



# లవ్ ఫెయిల్యూర్ ఐశ్వర్యకు అందని అఫర్లు



లవ్ ఫెయిల్యూర్ సినిమాతో అప్పట్లో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ ఐశ్వర్య మీనన్. అప్పట్లో ఈ అమ్మడిని తెలుగు ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత తెలుగు లో ఈమెకు ఆఫర్లు రాలేదు. కానీ అప్పటి నుండి కూడా తమిళం.. కన్నడ మరియు మలయాళంలో సినిమాలు చేస్తూ కెరీర్ ను స్టాం÷–రగ్ గా చేసుకుంది. దాదాపు పదేళ్ల తర్వాత తెలుగు లో ఈ అమ్మడు రీ ఎంట్రీకి సిద్ధం అయ్యింది. యంగ్ హీరో నిఖిల్ నటిస్తున్న స్పై సినిమా లో ఈ అమ్మడు నటిస్తున్న విషయం తెల్సిందే. ఐశ్వర్య మీనన్ హీరోయిన్ గా ఒక వైపు ఫుల్ బిజీగా ఉన్నా కూడా మరో వైపు ఇలా అందాల ఆరబోత విషయంలో రాజీ లేకుండా ఉంటుంది. గతంలో స్కిన్ షో విషయంలో కాస్త మొహమాట పడ్డట్లుగా అనిపించినా కూడా ఇప్పుడు ఆ మొహమాటం ను పక్కకు పెట్టినట్లుగా వ్యవహరిస్తుంది. హీరోయిన్ గా ఐశ్వర్య మీనన్ కి కమర్షియల్ సక్సెస్ లు.. ఆఫర్లు రావాలి అంటే కచ్చితంగా స్కిన్ షో చేయాల్సి ఉంది. అందుకే ఇలాంటి ఫొటోలను షేర్ చేస్తూ వస్తోంది. తాజాగా ఇలా క్లోజప్ సెల్ఫీ తో అందాలను చూపిస్తూ యూత్ ఆడియన్స్ కు కన్నుల విందు చేస్తోంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in